ప్రేమించిన యువతి

టెంపోరావ్

హాల్లోని ఫ్లోరసెంట్ లైట్లు వెలుగుతున్నాయి. తల్లి పక్కనే జయ కూర్చుని వుంది.

"బీచ్‌కి వెళ్దామన్నాడు. ఎనిమిది దాటింది. నాన్న యింకా రాలేదు" అంది జయ.

"ఆయనకి వెయ్యి పనులమ్మా. పది ఫ్యాక్టరీలకు ఆయన అధిపతి. తీరికేవుండదు" అంది తల్లి రామాయమ్మ.

అప్పుడే బ్యూక్ కారొచ్చి పోర్టికోలో ఆగింది. డ్రయివర్ తలుపు తెర్చాడు. మెరుస్తూన్న సూటులో వున్న ధర్మారావు దిగి ఠీవిగా హాల్లోకి వెళ్ళాడు.

భార్య, కూతురువంక నవ్వుతూ చూశాడు.

"ఇంత ఆలస్యంగా వచ్చావేమిటి నాన్నా?" అంది జయ.

"సారీ, రాలేకపోయానమ్మా. బీచ్‌కి రేపు వెళ్దాంలే" అన్నాడు తండ్రి సోఫాలో కూర్చుంటూ.

వంటామె ట్రేని తెచ్చి టీపాయిమీద పెట్టింది

కాఫీ కప్పును రామాయమ్మ భర్తకు అందించింది.

ఆఫీసులో అనేకసార్లు కాఫీ, టీ సేవించినా యింటి కొచ్చాక భార్య యిస్తే అతడు వద్దనడు.

కాఫీ తాగుతూ అతడు కూతురివంక చూశాడు.

"బీచ్‌కి వెళ్దాం నాన్నా" అంది జయ.

"ఇప్పుడా?"

"అర్ధరాత్రి కాదుగా!" అందామె.

"ఇవాళ నాకు చాలా బోరుగా వుంది నువ్వూ అమ్మా వెళ్ళిరండి."

"నేను రాను" అంది రామాయమ్మ.

జయ రుసరుస తల్లివైపు చూసింది.

"అయితే నేను ఒక్కర్తెనే నా కారులో వెళ్ళి వస్తాను" అంది జయ.

"డ్రయివర్ వెళ్ళిపోయాడు!" అంది తల్లి.

"నేనే డ్రయివ్ చేస్తాను."

ధర్మారావు కూతురుకేసి నవ్వుతూ చూశాడు.

"ఈ సమయంలో ఒంటరిగా వెళ్ళడం మంచిదికాదు. నా సెక్రటరీని నీతో పంపుతాను."

ధర్మారావు బయటకు చూశాడు.

"రామ్!" అని పిల్చాడు.

బయటనున్న రామ్ హాల్లోకి వచ్చాడు. ధర్మారావు ముందు వినయంగా నిలబడ్డాడు.

"సార్, పిల్చారా?" అడిగాడతను.

"అమ్మాయి బీచ్‌కి వెళ్తుందట. ఆమెతో వెళ్ళి భద్రంగా తీసుకురా! కారును నువ్వే డ్రయివ్ చెయ్యి" అన్నాడు ధర్మారావు.

"అలాగే సార్" అన్నాడు రామ్.

రామ్ వెళ్ళి కారులో కూర్చున్నాడు. జయ సోఫా లోంచి లేచింది.

"గంటలోపల తిరిగి వచ్చేయి" అన్నాడు తండ్రి.

జవాబివ్వకుండా జయ వెళ్ళిపోయింది. ప్రీమియర్ కారువైపు నడిచింది. స్టీరింగ్ వీల్ వెనక కూర్చున్న రామ్ సిగరెట్ పీలుస్తున్నాడు. ఆమె ముందు సీటుమీద కూర్చుని తలుపు మూసింది. రామ్ సిగరెట్ పారేయ బోయాడు.

"సిగరెట్ కాల్చుకోవచ్చు!" అందామె.

"థాంక్స్, జయ గారూ" అని అతను కారును పోనిచ్చాడు.

కారు స్పీడుగా బీచ్ వైపు ప్రయాణం చేస్తోంది. సిగరెట్ పొగపీల్చి వదుల్తూ అతడు కారును పోని స్తున్నాడు.

రామ్‌ని గురించి ఆమె ఆలోచిస్తోంది. యువకుడు అతడి వయస్సు 24 దాటివుండదు. మనిషి చక్కగా వుంటాడు. అతడు తన తండ్రి దగ్గర సెక్రటరీగా చేరి ఆరు నెలలు అయింది.

రామ్ ఎమ్.ఎ. పాసయ్యాడు. పొద్దుట ఎనిమిదిలోపల యింటికి వస్తాడు. నాన్నతో ఆఫీసుకు వెళ్తాడు. రాత్రి ఆలస్యంగా తనింటికి పోతాడు.

బీచ్ లోపలరోడ్డుమీద కారు ఆగింది. ఆమె దిగ లేదు. కార్లోనే కూర్చుంది. అతడు దిగి కారు పక్కనే యిసుకలో కూర్చున్నాడు.

జయ నలువైపులా చూసింది. లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. ఎనిమిది కావడం వలన బీచ్‌లో ఎక్కువ మంది లేరు.

ఆమె మెల్లిగా స్టీరింగ్ వీల్ వెనక్కి జరిగింది. ఇసుకలో కూర్చున్న అతడివంక చూసింది సముద్రంవైపు తిరిగి కూర్చున్నాడతను. సముద్రపు హోరు వినపడ్తోంది. చల్లగాలి వీస్తోంది.

ఒక యువకుడు, యువతి నవ్వుతూ, చేతులు కలిపి సముద్రంవైపు పోతున్నారు. వాళ్ళవైపు ఆమె సూటిగా చూసింది.

శర్మారావు ఒక్కగానొక్క కూతురు జయ. బి.ఎ. పూర్తిచేయడానికి రెండేళ్ళనుంచి ప్రయత్నిస్తోంది. ఆమె వయస్సు 22 వుంటుంది. పచ్చటి రంగు. కాని ఆమె అంత అందగత్తె కాదు. ఖరీదైన దుస్తుల్లో ఆమె ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

అంత అందంగా లేకపోయినా ఆమెవైపు పదేపదే చూడాలనిపిస్తుంది.

"రామ్‌గారూ!" పిల్చిందామె.

అతడు పరుగెత్తుకొచ్చాడు.

"పోదామా?" ప్రశ్నించిందామె.

"మీ యిష్టం" అన్నాడతను.

ఆమె కిలకిలా నవ్వింది.

"మీ పూర్తి పేరు ఏమిటి?"

"రామారావు."

"మీకు ఆకలేస్తోందా?" అడిగిందామె.

"ఆకలిగానే వుంది."

"ఇంటికెళ్ళి భోజనం చెయ్యొచ్చుగా?"

"మీ తండ్రిగారిచ్చిన పని పూర్తిచేసి తర్వాత భోజనానికెళ్తాను."

"అయితే పదండి."

"నేను డ్రయివ్ చేస్తాను. మీరు పక్క నే కూర్చోండి" అన్నాడతను.

"నాన్న యేమీ అనడు నేను కారును నడిపితే. కూర్చోండి" అందామె.

"ప్లీజ్" అన్నాడతను.

"మీకు చేదస్తం ఎక్కువ!" అని ఆమె పక్కకు జరిగింది.

అతడు స్టీరింగ్ వీల్ వెనక కూర్చున్నాడు. దేని కోసమో సీటుమీద వెతికాడు.

"ఏం కావాలి?" అందామె.

"ఇక్కడ అగ్గిపెట్టె వుండాలి."

కారు లోపల లైటు ఆన్ చేసి చూశాడు.

అగ్గిపెట్టె ఎక్కడా లేదు.

"పోనీయండి!" అని కారును పోనిచ్చాడతను.

"మీరు యెక్కడుంటున్నారు?" ప్రశ్నించింది ఆమె.

"అయినావరంలో."

"చాలా దూరం."

అతడు జవాబివ్వకుండా కారును పోనిచ్చాడు.

"మీతో ఎవరుంటున్నారు?"

"అమ్మ, నలుగురు చెల్లెళ్ళు."

"బిగ్ ఫామిలీ! నాకూ చెల్లెళ్ళు వుంటే యెంతో బాగుండేది!" అందామె.

కారు స్పీడుగా వెళ్తోంది.

"కారు ఆపండి!" అందామె హఠాత్తుగా.

అతడు కారును ఆపాడు.

"అగ్గిపెట్టె కొనుక్కోండి!" అందామె.

"తర్వాత కొనుక్కుంటాను."

"అన్నీ తర్వాతే!" అని నొక్కి పలుకుతూ ఆమె కిందకు దిగింది.

పక్కనున్న సిగరెట్ కొట్టుకు వెళ్ళి తిరిగి వచ్చి, కూర్చుని ఒక అగ్గిపెట్టెను ఆమె అతడికిచ్చింది.

"సిగరెట్ వెలిగించుకొని, కారును పోనీయండి" అందామె.

"నేను సిగరెట్ కాలిస్తే మీకేమిటి వస్తుంది?"

"సిగరెట్ కాలుస్తూ కారు నడిపే వాళ్ళను చూస్తే నాకు ముచ్చటగా వుంటుంది" అందామె.

అతడు సిగరెట్ వెలిగించి కారును పోనిచ్చాడు.

"మీరు చాలా మంచివారు" అందామె.

"నామీద మీకు మంచి అభిప్రాయం ఏర్పడినందుకు సంతోషం."

అమాంతంగా ఆమె అతడి చెయ్యిని పట్టుకుంది. అతడు తృళ్ళిపడ్డాడు.

"ప్లీజ్, నన్ను వదిలేయండి!"

"ఎందుకలా కంగారుపడ్డారు? మీ చెయ్యిని పట్టుకున్నది నా చెయ్యి. త్రాచుపాము కాదు!"

"ప్లీజ్, వదలండి!" అన్నాడతను.

"నేను వదలను! మీరే వదిలించుకోండి!"

"మిమ్మల్ని వేడుకుంటున్నాను. నా గురించి ఎవరేనా చెడుగా మాట్లాడితే నేను భరించలేను."

"ఎవరు మాట్లాడతారు?"

అతడు సీటు మూలకు జరిగాడు, కాని ఆమె అతడి చెయ్యిని వదల్లేదు.

ధర్మారావు యిల్లు దగ్గరవుతోంది. అతడు కారును ఆపాడు.

"నన్ను వదిలేయండి!"

ఆమె వదిలేసి వ్యంగ్యంగా నవ్వింది.

"ప్రాణం పోతున్నట్లు మీరు భయపడ్డారు. ముట్టుకుంటే ఏమవుతుంది?"

"జయగారూ, జీతంకోసం నేను మీ నాన్నగారి దగ్గర పనిచేస్తున్నాను. తల్లి, నలుగురు చెల్లెళ్ళు నామీద ఆధారపడి వున్నారు. నేనెందులోనైనా ఇరుక్కుంటే వాళ్ళందరూ కష్టపడ్తారు" అని అతడు కారును పోనిచ్చాడు.

"మీవాళ్ళకోసం మీరు జీవిస్తున్నట్లు వున్నారు?" అందామె.

"నిజం చెప్పారు. నాన్నగారు బ్రెయిన్ యాక్సిడెంట్ లో పోయారు. అటుపైన వాళ్ళ బాధ్యత నాదే."

ఆమె అతడివైపు తిరిగి చూసింది.

"మీది బానిస బతుకు!" అందామె కసిగా.

అతడు నవ్వాడు.

"ఈ లోకంలో స్వేచ్ఛ, నిజమైన స్వేచ్ఛ ఎవ్వరికీ వుండదు. ఆశయాలతో, ఆశలతో బానిసయి మనిషి జీవిస్తూ వుంటాడు" అన్నాడతను గంభీరంగా.

"మీరు చెప్పింది వినడానికి బాగుంది. మళ్ళీ చెప్పండి!"

చెప్పాడతను.

పోర్టికోలో అతడు కారును ఆపాడు. ఆమె కార్లోనే కూర్చుంది. అతడు దిగి తలుపు తెరిచాడు.

ఆమె దిగి తటాలున అతడితో కరచాలనం చేసింది.

"ఐ లైక్ యూ" అని ఆమె హాల్లోకి వెళ్ళిపోయింది.

హాల్లో లైట్లు వెల్గుతున్నాయి. వంటామె సోఫాలో

కూర్చుని వుంది.

"వాళ్ళు పైన వున్నారమ్మా" అందామె.

మెట్లెక్కి ఆమె పైకి వెళ్ళింది. కాన్సేపట్లో కిందకు దిగింది. ముందు వరండామీదకు నడిచింది.

"రామ్‌గారూ, మీరు ఇంటికి వెళ్లొచ్చు" అందామె.

"అలా మీ నాన్నగారు చెప్పారా?"

"నాన్నే చెప్పాడు."

కారు యిగ్నిషన్ కీని ఆమెకిచ్చి అతడు వెనక్కి తిరిగాడు.

"గుడ్‌నైట్" అందామె.

"గుడ్‌నైట్ జయగారూ" అని అతడు గేటువైపు కదిలాడు.

జయ ఆలోచిస్తూ హాల్లోకి నడిచింది.

2

మేడమెట్లు దిగి, సోఫాలో కూర్చుని ఫైలులోని వుత్తరాలను చూస్తున్న రామ్ వంక ఆమె నవ్వుతూ చూసింది.

"వచ్చి ఎంతసేపయింది?"

"ఇప్పుడే వచ్చానండి," అన్నాడతను.

"కాఫీ తాగారా?"

"మా యింట్లో తాగాను."

ఆమె లోపలకు వెళ్ళింది. కాఫీ తెచ్చి అతడికిచ్చింది.

"మీ కెందుకీ శ్రమ? వంటామె యిచ్చేవారుగా?" అన్నాడతను.

"ఇటుపైన మీకు కాఫీ నేనే యిస్తాను. మీకు కాఫీ యివ్వడమంటే నాకెంతో ఆనందం."

"అటువంటి పనులు చెయ్యకండి. నేనొక చిన్న వుద్యోగిని. మీరు రాజకుమారి, ఈ యింటికి!"

అతడు కాఫీ తాగి, కప్పునూ సాసరునూ తీసుకెళ్ళి డైనింగ్ టేబుల్ మీద పెట్టి వచ్చాడు. ఫైలు తీసుకుని కిందనున్న సెక్రటరీ గదిలోకి వెళ్ళి అతడు కూర్చున్నాడు.

తొమ్మిదింటికల్లా ధర్మారావు నుంచి కబురు వచ్చింది. అతడు హాల్లోకి వెళ్ళాడు. ధర్మారావు ఎదురుగా నిలబడ్డాడు.

"రామ్, ఇవాళ జయ ఏదో పిక్‌నిక్‌కి వెళ్తుందట. ఆమె కాలేజి వాళ్ళు బస్సులో వెళ్తారు. నువ్వు ఆమెను కారులో బస్సు వెనకనే తీసుకెళ్ళు."

"అలాగే సార్," అన్నాడతను.

"మీరు కూడా భోజనం అక్కడ మాతో చేయొచ్చు," అంది జయ.

అతడు తలాడించాడు.

"రామ్, సిమెంట్ ఫ్యాక్టరీ ఫైలు డ్రయివర్‌కి యిచ్చేయి," అన్నాడు ధర్మారావు.

"యస్సార్," అని రామ్ వెళ్ళిపోయాడు.

తల్లి కోపంగా కూతురి వంక చూసింది. "కాలేజి కెళ్ళడం మానేసి సంవత్సరం దాటింది. నీ క్లాస్‌మేట్సు ఎవ్వరూ లేరు. ఎందుకీ పిక్‌నిక్?" అర్చింది రామాయమ్మ.

"క్లాస్‌మేట్సు లేకపోవచ్చు. కాని మా లెక్చరర్సు వున్నారు. వాళ్ళే నన్ను రమ్మన్నారు. వాళ్ళు నాకు ట్యూషన్లు చెప్తున్నారుగా!" అంది జయ.

రామాయమ్మ భర్త వైపు తిరిగింది.

"ఒక్కగానొక్క కూతురని మీరు దాన్ని గారంచేసి పాడు చేస్తున్నారు. ఏది కావాలన్నా వెంటనే ఇచ్చే

సారు," అందామె.

"ఊరుకోవే! నీకు నాకూ మన పెద్దలు అలా యివ్వలేకపోయారు," అన్నాడు ధర్మారావు.

"మనం అందుకే బాగుపడ్డాం," అందామె.

"నేను పిక్‌నిక్‌కి వెళ్ళను, నాన్నా" అంది జయ.

"అదేమిటమ్మా?"

"నేనెక్కడికేనా వెళ్తానంటే వద్దు వద్దని అమ్మ మద్దెల వాయిస్తుంది!"

"అది అమ్మకు అలవాటేగా! అమ్మ వద్దన్నదని నువ్వు ఏదేనా మానేశావా?" అడిగాడు ధర్మారావు.

"లేదులే."

"నేను ఆఫీసుకు వెళ్తాను. విష్ యు ఎ జాలీ పిక్‌నిక్," అని ధర్మారావు బయటకు నడిచాడు.

కారులో ధర్మారావు కూర్చున్నాడు. డ్రయివర్ తలుపు మూశాడు. కాస్సేపట్లో కారు కదిలింది.

పోర్టికోలో నిలబడిన రామ్ వైపు జయ చూసింది.

"మనం పదింటికి బయల్దేరుదాం," అందామె.

"అలాగేనండి," అన్నాడతను.

మౌనంగా అతడు తన గదికి వెళ్ళి కూర్చున్నాడు. ఏదో ఫైలు తీసి అందులోని ఉత్తరాలను చదవసాగాడు.

3

రామ్ కారును పోనిస్తున్నాడు. పక్కనే జయ కూర్చుంది.

"మీ కాలేజి బస్సు ఎక్కడ నుంచి స్టార్ట్ అవుతుంది?" ప్రశ్నించాడు రామ్.

"మా కాలేజి నుంచి," అందామె.

"మనం ఎక్కడకు వెళ్ళాలి?"

"కాలేజీకి," అందామె.

ఆమె కాలేజి కాంపౌండులో అతడు కారు ఆపాడు. ఎక్కడా బస్సులేదు. కార్లోంచి దిగి ఆమె బిల్డింగులోకి వెళ్ళింది. విద్యార్థినులు యిటూ అటూ కాంపౌండులో తిరుగుతున్నారు.

సిగరెట్ పీలుస్తూ అతడు కారులోనే కూర్చున్నాడు. జయ తిరిగి వచ్చింది. కారులో కూర్చుని తలుపు మూసింది.

"పదండి," అందామె.

కారు బయటకు దూసుకుపోయింది.

"ఏదా బస్సు?" అడిగాడతను.

"నా కోసం చూసి చూసి వాళ్ళు వెళ్ళిపోయారు. నన్ను రమ్మన్నారు. చెంగల్‌పట్ వైపు వెళ్ళండి. తోవలో ఎక్కడో ఆ బస్సు మనకు తప్పక కనిపిస్తుంది" అందామె.

సిగరెట్ పీకను అతడు బయటకు విసిరాడు. కారును వేగంగా పోనిచ్చాడు.

"బస్సు డ్రయివర్లు స్పీడుగా పోతారు. ఆ బస్సు మనకు కనిపించదేమో!"

"కనిపించకపోతే ఫరవాలేదు. మనం పిక్‌నిక్ చేసుకుని యింటికి తిరిగి వద్దాం," అందామె.

అరగంటపైన కారు ప్రయాణం చేసింది. బస్సు ఎక్కడా కనబడలేదు. ట్రంక్ రోడ్డమ్మట లారీలు, ప్రయాణీకులున్న బస్సులు దూసుకుపోతున్నాయి.

"మనం యింటికి పోవడం మంచిదేమో!" అన్నాడతను.

"పిక్‌నిక్‌కి వెళ్ళితీరాలి. వాళ్ళు ఆ కొండ ప్రదేశంలో

వుంటారు."

ట్రంక్ రోడ్డమ్మట కారు కదుల్తోంది. రోడ్డుకిరువైపులా చింతచెట్లు వున్నాయి.

ఆమె అతడి చెయ్యి పట్టుకుంది. మెల్లిగా అతడి మీదకు వాలింది.

"ప్లీజ్ దూరంగా కూర్చోండి. జయమ్మగారూ!" అన్నాడతను.

"జయమ్మ ఏమిటి? నన్ను జయ అని పిలవండి!"

"ప్రతి యువతినీ నేను అమ్మగా భావిస్తాను!"

"యువతులకు ఎంత అవమానం? మీ దృష్టిలో యువతులందరూ ముసలమ్మలా?" అడిగిందామె.

"అలా నేననలేదు. వాళ్ళు దేవతలు. మీరిలా నా మీదకు వాలకండి. దూరంగా జరగండి."

"రామ్‌గారూ, మీరంటే నాకెంతో యిష్టం. ఐ లవ్ యూ!"

"నేను మిమ్మల్ని ప్రేమించలేను."

"ఎందువలన?"

"నేను ఎన్నో బాధ్యతలున్న మనిషిని. నా నలుగురు చెల్లెళ్ళకీ పెళ్ళిళ్ళు అయితేగాని నేను పెళ్ళాడను. అదంతా అయ్యేదాకా నేను ఎవర్నీ ప్రేమించలేను."

ఆమె అతడి జుత్తును నిమిరింది.

"మీరిలా బానిసగా పడుండడం నా కిష్టంలేదు. మీరు బాగా వృద్ధిలోకి వస్తారు. మనం చాలా ఆనందంగా వుండొచ్చు."

అతడు కారును ఆపాడు. ఆమె వంక సూటిగా చూశాడు.

"నేను మీకు ఏ విధంగానూ సరిపోను, జయగారూ.

నా పేరు ఎత్తితే మీ నాన్నగారు మిమ్మల్ని తిట్టి నన్ను తన్ని పొమ్మంటారు. ప్లీజ్ నన్నిలా బతకనివ్వండి!" అన్నాడతను.

ఆమె అతడిని వదిలేసింది. అతడు కారును పోనిచ్చాడు.

"మీరు ఎమ్మే యెలా పాసయ్యారో నాకు అర్థం కావడంలేదు. మన ప్రేమ గురించి నాన్నతో నేను చెప్పాను. నాన్న ఏమీ అనడు. మన పెళ్ళికి ఒప్పుకుంటాడు," అందామె.

గంటపైన కారు వెళ్తూనే వుంది. ఇరువైపులా కొండ ప్రదేశం.

"ఇంకా ఎంత దూరం వెళ్ళాలి, ఆ బస్సుకోసం?" అడిగాడతను.

అతడి కళ్ళలోకి ఆమె సూటిగా చూసింది. "రామ్ గారూ, నాన్నతో అబద్ధం చెప్పాను. బస్సులో పిక్నిక్కి ఎవ్వరూ వెళ్ళలేదు. మీతో కాలం గడపాలని నాన్నతో అలా చెప్పాను," అందామె.

తటాలున అతడు కారును ఆపాడు.

"ఇంటికెళ్ళాక మీరు నిజాన్ని నాన్నగారికి చెప్తారా?" అడిగాడతను.

"చెప్పవలసిన అవసరం వస్తేగాని చెప్పను," అందామె.

"కాని నేను నిజం చెప్పాలి," అన్నాడతను.

ఆమె కారులోంచి దిగింది. రామ్ కూడా దిగాడు. ఆమె అతడి వంక సూటిగా చూసింది.

"వెనక కేరియర్ దగ్గరా వున్న ప్లాస్టిక్ బుట్టవుంది. దాన్ని తీసుకోండి. ఆ కొండ ప్రదేశంలో కూర్చుని

ఏం చేయవలసిందీ ఆలోచించుదాం," అందామె.

"వెనక్కి పోదాం," అన్నాడతను.

"నాకు చాలా ఆకలిగా వుంది. ఏదేనా తింటేగాని కదల్లేను," అందామె.

మరేం గత్యంతరం లేక అతడు ప్లాస్టిక్ బుటను తీసుకున్నాడు. ఇద్దరు కొండవైపు నడిచారు. కొండ మొదట్లో వున్న ఒక చెట్టుకింద కూర్చున్నారు.

ఒక ప్లేట్లో పదార్థాలు అన్నీ పెట్టి ఆమె అతడికిచ్చింది.

"మీరు బాగా తినాలి," అందామె.

"బాగా ఆకలిగా వుందని మీరన్నారు. నేను అనలేదు."

"మీకు ఆకలిగా లేదా?"

"నాకు ఆకలి తక్కువ. నేను ఎక్కువగా ఎప్పుడూ తినను," అన్నాడతను.

ప్లేటువైపు చూస్తూ వుండిపోయాడతను. "మీకు పెట్టనా?" ప్రశ్నించాడు.

"నేను పెట్టుకుంటాను లెండి."

మరో ప్లేటులో ఆమె వడ్డించుకుంది. ఇద్దరూ తినడం ప్రారంభించారు.

"నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. నాన్న దగ్గర పనిలో చేరినప్పటి నుంచీ మీరు నాకు నచ్చారు. మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నాను. నా గురించి మీకెలా వుందో చెప్పండి!"

"జయగారూ, మీరు చాలా అందంగా వుంటారు. కోటీశ్వరుల కొడుకులు ఎందరో మిమ్మల్ని పెళ్ళాడ్డానికి ముందుకొస్తారు. ప్రేమ నే పదానికి అర్థం లేదు. మీకు

నేను ఏ విధంగానూ సరిపోను."

"మీ బాధ్యతలన్నీ నేను తీసుకుని మీ చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు చేయిస్తాను. మీకు ఏ బెంగా లేకుండా చూస్తాను. మీరు సరే అంటే నాన్నతో మాట్లాడతాను. మన పెళ్ళి జరిగిపోతుంది."

"ప్లీజ్ నన్ను బలవంత పెట్టకండి. ఏ ధనవంతుడూ తన బిడ్డను ఒక పేదవాడి కివ్వడానికి అంగీకరించడు. నాతో మీరు సుఖంగా వుండలేరు."

లంచ్ ముగించి వాళ్ళు చేతులు కడుక్కున్నారు. పాత్రలను రామ్ ప్లాస్టిక్ బుట్టలో పెట్టాడు. ఆమె అతడి వంక అలాగే చూస్తూ వుండిపోయింది.

"ఇక పోదామా?"

ఇద్దరూ లేచారు. అమాంతంగా ఆమె చేతుల్తో అత డిని చుట్టేసింది. అతడి బుగ్గ మీద ముద్దెట్టుకుంది.

"నన్ను వదలండి ప్లీజ్!" అని అర్చాడతను.

ఇద్దరూ కారువైపు నడవసాగారు.

మార్గంలో వుంది ట్రంక్ రోడ్డు. సిగరెట్ కాలుస్తూ రామ్ నడుస్తున్నాడు.

"మీరు సినిమాలు చూస్తారా?"

"నేను సినిమాలు ఎప్పుడూ చూడను."

"టీవీలో వచ్చే సినిమాలను చూడరా?"

"మా యింట్లో టీవీ లేదు."

"రామ్‌గారూ' ప్రేమతో యింత దూరం నేను మీతో వచ్చాను. నా ప్రేమను మీతో చెప్పుకున్నాను. కాని మీరు నన్ను చులకనగా చూస్తున్నారు!"

"అలా అనకండి! మిమ్మల్ని దేవతలా నేను చూస్తు న్నాను. మీకోసం మరో దేవత భూమ్మీదకు దిగి వస్తే

డని అంటున్నాను," అన్నాడతను.

"ఆ దేవత మీరే!" అందామె.

"మీరు పొరబడ్డారు."

ఇద్దరూ కారులో కూర్చొన్నారు. అతడు కారును వెనక్కి తిప్పి పోనిచ్చాడు.

"ఈ పిక్‌నిక్ విషయం నాన్నతో నేను చెప్పు కుంటాను. మీరేమీ మాట్లాడవద్దు," అందామె.

"అలాగేనండి," అన్నాడతను.

జయ మాట్లాడకుండా మౌనంగా కూర్చుండి పోయింది. రామ్ కారు నడపడంలో నిమగ్నుడయ్యాడు.

కారు పట్నానికి దగ్గరవుతోంది. కన్నీళ్ళతో ఆమె అతడి వంక చూసింది.

"మీలాంటి దద్దమ్మను నే నీ జీవితంలో మళ్ళా చూడను. అవకాశం దొరికితే కోతి కొమ్మెక్కి కూర్చుం టుంది. మీలా బురదలో దొర్లుతూ కూర్చోదు!" అర్చిం దామె.

"జయగారు, దయచేసి ఏడవకండి. మిమ్మల్ని నేను ఏడిపించానని లోకం అనుకుంటుంది."

"లోకం! ఎక్కడుంది లోకం! మీకు జీతం యిస్తు న్నది నాన్న," అందామె.

అమాంతంగా ఆమె అతడి వంక కోపంగా చూసింది. కళ్ళతో అతడిని కొట్టింది.

"మిమ్మల్ని నాశనం చెయ్యాలనిపిస్తోంది! మీలాంటి వానిసలు యీ లోకంలో వుండకూడదు!"

"జయగారూ, పిచ్చుకమీద బ్రహ్మాస్త్రమా? నేను మిమ్మల్ని ప్రేమించలేను, మీతో పోరాడలేను. నేను బలహీనుడిని," అన్నాడతను మెల్లగా.

పోర్టికోలో కారు ఆగింది. ఆమె దిగి లోపలకు వెళ్ళి పోయింది. ప్లాస్టిక్ బుట్ట పట్టుకొని రామ్ యింట్లోకి నడిచాడు.

4

పరుపుమీద పడుకుని ధర్మారావు ఏదో ఆంగ్లపత్రిక చదువుతున్నాడు.

జయ మెల్లగా గదిలోకి వెళ్ళి అతడి పక్కనే కూర్చుంది.

"ఏమిటమ్మా?" అన్నాడతను.

"నాన్నా, నిన్నొకటి అడగాలి!"

"ఒకటేమిటి వెయ్యి అడుగు!"

"రామ్‌గాడ్ని డిస్‌మిస్ చేసి పొమ్మను నాన్నా."

అతడు ఆశ్చర్యంగా కూతురి వైపు చూశాడు. "ఆరు నెలల క్రితం అతడు ఇక్కడికొచ్చాడు. మొదట నువ్వే అతడితో మాట్లాడి నా దగ్గరకు పంపావు. అతడికి ఉద్యోగం ఇయ్యమన్నావు. ఇచ్చాను. ఇప్పుడు పొమ్మంటే బాగోదమ్మా" అన్నాడు ధర్మారావు.

"ఆయనంటే నాకు అసహ్యం నాన్నా. ఆయన్ని చూస్తే గొంగళీ పురుగులు ఒంటిమీద పాకుతున్నట్లు వుంటుంది."

"అతడు చెడ్డవాడా?"

"ఎందుకూ పనికిరాని వాడు, అసమర్థుడు."

కూతురి వంక అతడు సాలోచనగా చూశాడు.

"అయితే అతడిని పొమ్మంటానులే" అన్నాడు.

"నాన్నా, ఐ లవ్ యూ," అని తండ్రి నుదురు మీద ముద్దెట్టుకుని ఆమె వెళ్ళిపోయింది.

ఏర్ కండిషండ్ గదిలో ధర్మారావుకి ఎదురుగా

రామ్ నిలబడివున్నాడు.

"అలా కూర్చో!" అన్నాడు ధర్మారావు.

"ఫరవాలేదు లెండి," అన్నాడతను.

"మా అమ్మాయికీ నీకూ ఏదేనా పోట్లాట జరిగిందా?"

"నేనెవరితోటీ పోట్లాడను, సార్."

"అది నాకు తెలుసు. అమ్మాయితో బీచ్‌కి వెళ్లావు. పిక్‌నిక్‌కి వెళ్ళావు. అక్కడ యేం జరిగిందో నాకు చెప్పు!"

"నన్ను ప్రేమిస్తున్నట్లు ఆమె చెప్పారు. మీకు తెలియకుండా, మీ వెనక ఆమెతో సంబంధం పెట్టుకోవడం నాకిష్టంలేదు. నాకు వుద్యోగమిచ్చి మీరు ఎంతో సహాయం చేశారు. నేను పేదవాడిని. ఆమెకు ఏ విధంగానూ తగనివాడిని. అదంతా ఆమెతో చెప్పాను సార్."

ధర్మారావు నవ్వాడు.

"ఆ నాడు పిక్‌నిక్ లేదుసార్. ఏ బస్సూ రాలేదు. మేమిద్దరమే కొండ ప్రదేశానికి వెళ్ళి, అక్కడ భోజనం చేసి తిరిగి వచ్చాం."

ధర్మారావు అతడి వంక సూటిగా చూశాడు.

"ఇటుపైన నువ్వు నా పెర్సనల్ సెక్రటరీగా వుండనక్కరలేదు," అన్నాడు ధర్మారావు.

రామ్ తృళ్ళిపడ్డాడు.

"నేను ఏ తప్పూ చెయ్యలేదు సార్. నాకు ఉద్యోగం లేకుండా చెయ్యకండి," అన్నాడు రామ్.

ధర్మారావు అతడి వంక నవ్వుతూ చూశాడు.

"రామ్, నీకు ప్రమోషన్ యిస్తున్నాను. బెంగుళూరులో వున్న నా బాటరీస్ కంపెనీకి నిన్ను మేనే

జర్ గా నియమిస్తున్నాను. జీతం నాలుగువేలు యిస్తాను. మంచి యిల్లు, కారు అన్నీ నేకిస్తాను."

"మిమ్మల్ని పూజించాలి, సార్."

"మనం పూజించవలసింది దేవుడిని, మనుషులను కాదు," అన్నాడు ధర్మారావు.

ఆ నాటి రాత్రి రామ్ ధర్మారావు కారులో ఇంటికి వచ్చాడు. సెక్రటరీ ఆఫీసు గదిని వెతకసాగాడు. తన బాగ్ వుంది. అందులోని పాంట్, షర్ట్ కనిపించలేదు.

తన బాగ్ పట్టుకుని అతడు హాల్లోకి వెళ్ళాడు. అక్కడ జయ కూర్చుని వుంది.

"జయగారూ, వెళ్ళివస్తానండి," అన్నాడతను.

"వెళ్ళండి. మళ్ళీ రావద్దులెండి," అందామె కోపంగా.

"అలాగేనండి," అని అతడు బయటకు నడిచాడు.

గేటు వైపు పోతున్న రామ్ కేసి విచారవదనంతో చూస్తూ ఆమె వుండిపోయింది.

5

ధర్మారావు బీరువా ముందు నిలబడి చూస్తున్నాడు. భార్య పక్కనుంది.

"నా బ్లూ సూట్ యేమైంది?" అడిగాడతను.

"అక్కడే వుంటుంది చూడండి."

"లేదే!"

"లాండ్రీకి పంపారేమో!"

"జయను అడిగి చూడు," అని అతను వరో సూటు ధరించాడు.

మెట్లు దిగి హాల్లోకి వచ్చాడు. ఒంటరిగా జయ అక్కడ కూర్చుని వుంది.

ఆమె మొహంలో నవ్వులేదు. జయ అదోలా వుంది.

"ఏమిటమ్మా, అలా వున్నావు?" అడిగాడు తండ్రి.

"బాగానే వున్నాను," అందామె.

"పెళ్ళి చేస్తేగాని దీని రోగం కుదరదు!" అంది రామాయమ్మ.

"నాకు యే రోగం లేదులే!" అంది జయ.

రామాయమ్మ, ధర్మారావు, జయ డైనింగ్ గదిలోకి నడిచారు.

ముగ్గురూ బ్రేక్ ఫాస్టు సేవించారు.

"అమ్మాయి నా బ్లూ సూటు లాండ్రీకి పంపావా?"

"లేదు, నాన్నా."

"అనేక వస్తువులు యింట్లో మాయమవుతున్నాయి. ఎవరు పట్టుపోతున్నారో!" అంది రామాయమ్మ.

"అరడజను మంది నౌకర్లు ఎప్పుడూ యింట్లో తిరుగుతూ వుంటారు. పబ్లిక్ పార్కులా వుంది మన ఇల్లు," అంది జయ.

"రామ్ బాగ్ లో వుండవలసిన పాంటు, షర్టు పోయాయట. అతడు నాతో చెప్పాడు," అన్నాడు ధర్మారావు.

"ఆయన ధరించే ఖరీదు బారుదు సూటలు ఎవరికాకా వాలి?" అంది జయ.

"నేను మీతో చెప్పలేదు. వారం రోజుల క్రితం కొత్త స్లిప్పర్సు నేను కొనుక్కున్నాను. అవి ఎక్కడా కనపడ్డంలేదు," అంది రామాయమ్మ.

"నీకు డజన్ల మీద జోళ్ళు వున్నాయమ్మా. కొని యెక్కడో పారేస్తావు," అంది జయ.

"పోయినవాటిని గురించి చర్చించి బుర్ర పాడు చేసుకోకండి," అని ధర్మారావు లేచాడు.

అతడు బయటికి నడిచాడు. కారులో కూర్చున్నాడు. కారు కదిలింది.

తల్లీ కూతురు హాల్లోకి వచ్చారు.

"అమ్మా, నేనోకసారి మా ఫ్రెండు కమల ఇంటికి వెళ్ళివస్తాను" అంది జయ.

"లంచ్ టైముకు వచ్చేయి" అంది తల్లి.

"అలాగే వస్తాను" అని జయ తన కారులో వెళ్లి పోయింది.

ఒంటిగంట దాటాక ఆమె తన ఇంటికి తిరిగి వచ్చింది. టెలిఫోన్ మ్రోగింది. జయ వెళ్ళి రిసీవర్ని ఎత్తింది.

"హలో!" అంది.

"నేను కమలని" అందో యువతి అటువైపునుంచి.

"హై కమలా, ఏమిటి సంగతి?"

"నీకు ఒక పార్కర్ పెన్ను చూపించాను. నా పుట్టిన రోజున నా భర్త నాకు ప్రెజెంటుగా ఇచ్చారని నీతో చెప్పాను, గుర్తుందా?"

"వుంది" అంది జయ.

"ఆ పెన్ను కనబడ్డంలేదు. నీ హేండ్ బాగ్ లో వుందేమో చూడు!"

"నా హేండ్ బాగ్ లో ఎలా వుంటుంది, సిల్లీ!" అరిచింది జయ.

"జయా, ప్లీజ్! అది పోయిందని వింటే మా ఆయన తిడ్తారు. ఒకసారి నీ బాగ్ లో చూడు!"

జయ బాగ్ లో చూడలేదు.

"కమలా, బాగ్ లో చూశాను. ఎక్కడా లేదు. నువ్వు బెంగెట్టుకోకు! నీ యింట్లో వెతుకు. ఎక్కడో వుంటుంది. దొరక్కపోతే నాకు ఫోన్ చేసి చెప్పు. అటు

వంటిదే నేను కొని నీకిస్తాను" అంది జయ.

"థాంక్స్ జయా, చూస్తాను."

జయ రిసీవర్ పెట్టేసి, మెట్లెక్కి తన గదివైపు నడిచింది.

6

ధర్మారావు కోపంగా భార్య, కూతురివైపు చూశాడు.

"అది చాలా ఖరీదైన వాచ్. అమెరికాలో కొన్నాను. ఎవరో దొంగిలించారు!" అరిచాడతను.

"పనిమనిషి కామిన్ని అడిగిచూద్దాం" అంది రామాయమ్మ.

కాసేపట్లో కామిని గదిలోకొచ్చింది.

"అయ్యగారి వాచ్ ఆ టేబుల్ మీద వుండాలి. నువ్వు యీ గది తుడిచావు. ఆ వాచ్‌ని చూశావా?" అడిగింది రామాయమ్మ.

"చూడలేదమ్మా" అంది కామిని.

"ఈ యింట్లోని వస్తువులు ఎన్నో పోయాయి. పోలీసు రిపోర్టు యిస్తున్నాను" అన్నాడు ధర్మారావు కోపంగా.

"నాకేం తెలవదయ్యా. ఎన్నేళ్ళగానో యిక్కడ పనిచేస్తున్నాను. ఎన్నడూ నేనేదీ తీయలేదయ్యా."

ధర్మారావు కూతురివైపు చూశాడు.

"డైరక్టరీలో వున్న నంబరు చూసి యిన్‌స్పెక్టర్ నాయర్‌ని యిక్కడకు రమ్మను. నా పేరు చెప్పు!"

"అలాగే నాన్నా" అని జయ ఫోన్ దగ్గరకు నడిచింది.

ఇన్‌స్పెక్టర్ నాయర్‌తో మాట్లాడి ఆమె తిరిగి వచ్చింది.

"ఇన్‌స్పెక్టర్ నాయర్ వస్తున్నారు, నాన్నా" అంది

జయ.

పదినిమిషాల తర్వాత ఇన్‌స్పెక్టర్ నాయర్ ధర్మా రావును కలుసుకున్నాడు.

"ఏం జరిగిందో చెప్పండి!"

"నా అమెరికన్ రిస్టువాచ్‌ని యెవరో దొంగిలించారు మిస్టర్ నాయర్. అది స్పెషల్ టైపు వాచ్. డే, డేటు వుంటాయి. ఇండియన్ టైమ్‌నీ, గ్రీన్‌విచ్ టైమ్‌నీ చూపి స్తుంది. చంద్రుడు ఆకాశంలో యే రూపంలో వున్నదీ ఆ వాచ్‌లో చూడొచ్చు. అలారామ్ కొడ్తుంది. దాని ఖరీదు వెయ్యి డాలర్స్" అన్నాడు ధర్మారావు.

"మీరు ఎవర్ని అనుమానిస్తున్నారు?"

"ఈ యింట్లో ఆరుమంది నౌకర్లు వున్నారు. వాళ్ళందర్నీ అనుమానించాలి. మీరు వాళ్ళతో మాట్లాడి చూడండి. అందర్నీ ముందు వరండాలో వుండమన్నాను."

ఇన్‌స్పెక్టర్ నాయర్ బయటకు నడిచాడు. వరండా మీద ముగ్గురు స్త్రీలు, ముగ్గురు పురుషులు వున్నారు. రామాయమ్మ వాళ్ళను యిన్‌స్పెక్టర్ నాయర్‌కి పరి చయం చేసింది.

"అతను పుల్లయ్య. ఇంటికి కావలసిన వస్తువులు కొని తెస్తూ వుంటాడు. రెండో అతను రాముడు. ఇంట్లో పనులు చూస్తూవుంటాడు. మూడోవాడు రాజు. బాత్ రూమ్‌లను శుభ్రపరుస్తూ వుంటాడు. ఓవర్ హెడ్ టాంక్‌లనుకూడా అతనే చూస్తాడు."

ఇన్‌స్పెక్టర్ నాయర్ తల పంకించాడు.

"ఆమె కామిని. పై గదులు తుడుస్తూ వుంటుంది. రెండోది కాంత. కింద గనులను తుడుస్తుంది. మూడోది రమణి. అంటుపాత్రలను కడుగుతూ వుంటుంది."

ఇన్‌స్పెక్టర్ నాయర్ వాళ్ళను ప్రశ్నించడం ప్రారంభించాడు. అందరి మొహాల్లోనూ భయం గోచరిస్తోంది.

రామాయమ్మ హాల్లోకి వెళ్ళింది. భర్తవంక నవ్వుతూ చూసింది.

"వాళ్ళందరూ భయపడుతున్నారు. ఇన్‌స్పెక్టర్ని పొమ్మనడం మంచిదేమో!" అందామె.

"ఇన్‌స్పెక్టర్ని చూసి భయపడి యిటుపైన దొంగతనాలు మానేస్తారు" అన్నాడు ధర్మారావు.

అరగంట తర్వాత ఇన్‌స్పెక్టర్ నాయర్ హాల్లోకి వచ్చాడు.

"ఇదే కాంపౌండ్‌లో ఆ నౌఖర్లు వుండే గదులన్నీ సోదాచేసి వచ్చాను సార్. మీ వాచ్ ఎక్కడా లేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ధర్మారావు గంభీరంగా నవ్వాడు.

"మిస్టర్ నాయర్, దొంగలించబడిన వస్తువు అంత సులువుగా మన కంటబడదు. అది యెక్కడికో అమ్మకానికి వెళ్ళొచ్చు. యూ మస్టు బి వాచింగ్!" అన్నాడతను.

"తప్పకుండా వాచ్ చేస్తాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

జయ అప్పుడే హాల్లోకి వచ్చింది. ఆమెవంక ఇన్‌స్పెక్టర్ ఓరగా చూశాడు.

"ఈమె నా కూతురు జయ" అన్నాడు ధర్మారావు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ ఆమెకు నమస్కరించాడు. ఆమె ప్రతినమస్కారం చేసింది.

"ధర్మారావుగారూ, ఈ నౌఖర్లు కాక మరెవరేనా యిక్కడ వున్నారా?"

"ఇద్దరు డ్రయివర్లు వున్నారు. వంటామె వుంది. గూర్ఖా వున్నాడు. కాని వాళ్ళు యింట్లోకి సాధారణంగా రారు" అన్నాడతను.

•ఇన్‌స్పెక్టర్ నాయర్ తల ఆడించాడు.

ధర్మారావు అతడికి ఒక కవర్ను అందించాడు. "మీ అమ్మాయి పెళ్ళికి డబ్బు కావాలన్నారు. అందులో వుంది. ఇరవైఐదు వేలు" అన్నాడు ధర్మారావు.

"థాంక్స్ సార్! మీ వాచ్ యేమైందో నేను కనుక్కుంటాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

7

రామాయమ్మ, ధర్మారావు సోఫాలో పక్కపక్కనే కూర్చున్నారు.

"జయ యేదీ?"

"బీచ్ కని వెళ్ళింది. ఇంకా రాలేదు!"

"డ్రయివర్ని పంపావా?"

"డ్రయివర్ వద్దంటుంది! దాన్ని గురించి ఆలోచిస్తూంటే నా బుర్ర పాడవుతోంది. ఏదో సంబంధం చూసి దానికి పెళ్ళి చేసేస్తే మన కే బెంగా వుండదు."

"చూద్దాం" అన్నాడు ధర్మారావు సాలోచనగా.

ముగ్గురూ డిన్నర్ సేవిస్తున్నారు. జయ మౌనంగా తింటోంది.

"జయా, నీ ఆరోగ్యం బాగాలేదా?" తండ్రి ప్రశ్నించాడు.

"డాక్టర్ కేశవ్ నిన్ననే చెకప్ చేశారు. గుండు

పిక్చర్‌లా వున్నానన్నారు" అంది జయ.

"కాని నీలో యేదో మార్పుంది!"

"నాలో లేదు, మీరు వూహించుకొంటున్నారు."

"చేంజ్ ఆఫ్ ప్లేస్ నీకు బాగుంటుంది. నేను రేపు బెంగుళూరు వెళ్తున్నాను. నువ్వు నాతో రా!"

"ప్లేన్‌లో అయితే వస్తాను. ఆకాశంలో దూసుకు పోవాలని వుంది నాకు!" అందామె.

"ప్లేన్‌లోనే పోదాం" అన్నాడు తండ్రి.

ఆమె సంతోషంగా తండ్రివైపు చూసింది. "జాలిగా వుంటుంది, నాన్నా" అందామె.

మర్నాడు ధర్మారావు, జయ బెంగుళూరు చేరుకున్నారు. హోటల్ రియోలో డబుల్ రూమ్ విత్ డ్రాయింగ్ రూమ్ తీసుకొన్నారు.

ధర్మారావు యేదో మీటింగ్‌కి వెళ్ళాడు. స్నానం చేసి జయ పత్రికను చూస్తోంది.

టెలిఫోన్ మ్రోగింది.

"హలో!" అందామె.

"ధర్మారావుగారికి కాల్ మిస్" అంది టెలిఫోన్ ఆపరేటర్.

"ఎవరు కాల్ చేస్తున్నారు?"

"రామారావుగారు!"

ఆ పేరు విని ఆమె తృళ్ళిపడింది.

"కనెక్షన్ యివ్వండి!" అందామె.

అటువైపునుంచి రామ్ కంఠం వినబడింది.

"నేను జయను. రామ్‌గారా?" అందామె.

"జయగారూ, నమస్కారం. నేను రామ్‌నే."

"ఈ పట్నంలో యేం చేస్తున్నారు?"

"ఇక్కడో బేటరీస్ కంపెనీకి మేనేజర్ గా వుంటున్నాను."

"మీ చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు అయ్యాయా?"

"ఇద్దరికి పెళ్ళిళ్ళు అయ్యాయి."

"కొంతవరకూ బాధ్యత తీరింది" అందామె.

"ఇంకా యిద్దరు వున్నారు. వాళ్ళు చదువుకుంటున్నారు."

"మీరు ఎక్కడనుంచి మాట్లాడుతున్నారు?"

"మా ఆఫీసునుంచి."

"వెంటనే యిక్కడకు రండి. మీతో మాట్లాడాలి" అందామె.

"వస్తానండి" అన్నాడతను.

రిసీవర్ పెట్టేసిందామె. మేకప్ చేసుకొని చక్కటి దుస్తులు ధరించింది. సోఫాలో కూర్చుని అతడి రాక కోసం యెదురుచూసింది.

ఎవరో తలుపును తట్టారు.

"కమిన్!" అందామె.

తలుపు తోసి రామ్ లోపలకొచ్చాడు. క్షణకాలం ఆమెవంక చూస్తూ వుండిపోయాడు.

జయ అతడివంకే చూస్తోంది. చక్కటి సూటులో వున్నాడతను. యెంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాడు.

"ఇలా కూర్చోండి" అందామె తన పక్క సీటు చూపిస్తూ.

ఎదురుగా వున్న మరో పెద్ద సోఫాలో అతడు కూర్చున్నాడు.

"మిమ్మల్ని చూసి సంవత్సరం దాటింది....!"

అందామె.

"కాలం దొర్లిపోతూ వుంటుంది, జయగారూ" అన్నాడతను.

ఆమె లేచి నిలబడింది. అతడి వంక నవ్వుతూ చూసింది.

మెల్లిగా వెళ్ళి అతడి పక్కనే కూర్చుంది.

"అక్కడ బోరు కొట్టి బెంగుళూరు వచ్చాను. మీరు నన్ను కారులో తిప్పాలి" అందామె.

రామ్ నవ్వాడు.

"జయగారూ, నా కంతగా తీరిక వుండదు. కంపెనీ పనితో సరిపోతుంది."

"ఆ కంపెనీ ఎవరిది?"

"మీ నాన్నగారిది!"

ఆమె తృప్తిపడింది. రామ్ గురించి ఆమె ఆలోచిస్తోంది. నాన్న అతడిని డిస్మిస్ చేసి పొమ్మనలేదు. మరో ఉద్యోగం యిచ్చి తనకు దూరంగా పంపేశాడు!

తటాలున ఆమె అతడి చెయ్యి పట్టుకొంది. అతడి కళ్ళలోకి చూసింది.

"సంవత్సరం దాటినా నా ప్రేమ తరగలేదు!" అందామె.

అతడు మౌనం వహించాడు. చేతులో చుట్టేసి ఆమె అతడి పెదిమలను ముద్దెట్టుకుంది. అతడు దూరంగా జరగలేదు.

"రామ్, నాన్నతో మన పెళ్ళి గురించి మాట్లాడుతాను" అందామె.

"మీ యిష్టం" అన్నాడతను.

8

రామ్ తన యింటి అల్లుడు కాకూడదని రామాయమ్మ యెంతగానో మొరపెట్టుకుంది. కాని ఆమె పెళ్ళిని ఆపలేకపోయింది.

"రామ్ బుద్ధిమంతుడు, తెలివైనవాడు. అమ్మాయి అతడితో సుఖంగా బతుకుతుంది," అన్నాడు ధర్మారావు.

రోజులు వేగంగా గడిచిపోయాయి. రామ్, జయలు భార్యాభర్తలయ్యారు.

రామ్ తల్లి, యిద్దరు చెల్లెళ్ళు పెళ్ళి తర్వాత ధర్మారావు యింటికి మారిపోయారు. కింద భాగంలో వున్న గదుల్లో వాళ్ళు వుంటున్నారు.

రామ్, జయ హనీమూన్ కి ఊటీ వెళ్ళారు. స్పెన్సర్ హోటల్లో గది తీసుకున్నారు.

రామ్ హోటల్ గదిలో అన్ని చోట్లా వెతుకుతున్నాడు.

"రామ్, దేనికోసం చూస్తున్నావు?" అంది జయ.

"నా సిగరెట్ కేస్ కనపడ్డంలేదు! పెళ్ళిలో మీ నాన్నగారు నాకిచ్చారు. గోల్డు కేసు!"

"ఏ హోటల్ నౌకరో పట్టుకుపోయి వుంటాడు" అందామె.

"హోటల్ మేనేజర్కి కంప్లెయింట్ యిస్తాను" అన్నాడతను.

"పోతే పోనీ గొడవ చెయ్యకు!"

"మన వస్తువులు పోతూంటే వూరుకోకూడదు. నోరు మూసుకు కూర్చుంటే యింకా యెన్నో పోతాయి" అన్నాడతను.

"రామ్, నా కిక్కడ నచ్చలేదు. మనం కాశ్మీర్ పోదాం" అందామె.

"అలాగే పోదాం. రెండు నెలలపాటు తిరిగి ఇంటికి రమ్మన్నారు నీ నాన్నగారు" అన్నాడతను.

కాశ్మీర్, డార్జిలింగ్ మొదలగు ప్రదేశాలన్నీ తిరిగి రామ్, జయలు యింటికి తిరిగివచ్చారు.

రోజులు సుఖంగా సాగిపోతున్నాయి. ధర్మారావుతో కలిసి రామ్ అన్ని కంపెనీలనూ మేనేజ్ చేస్తున్నాడు.

ఆ రోజు శనివారం. పొద్దుటే రామాయమ్మ అరవడం ప్రారంభించింది.

"నా బంగారు గాజులు రెండు కనబడ్డంలేదు" అర్చిందామె.

"ఎవరు యీ గదిలోకి వచ్చారు?...." అడిగాడు రామ్.

"అందరూ వస్తారు. నీ చెల్లెళ్ళు వచ్చారు. జయ వచ్చింది. ఎవర్ని అనుమానించడం?" అందామె వ్యంగ్యంగా.

రామ్ కోపంగా ఆమెవైపు చూశాడు.

"నా చెల్లెళ్ళు ధనవంతులు కాకపోవచ్చు. కాని వాళ్ళు పరాయి సొత్తును ఎన్నడూ ముట్టుకోరు" అన్నాడు రామ్.

"వాళ్ళ గదులు సోదా చేస్తే నిజం బయటపడుతుంది" అంది రామాయమ్మ.

ధర్మారావు అప్పుడే వచ్చాడు. భార్య మాటలు అతడి చెవిన పడ్డాయి.

"సోదా యేమిటి? నోరు మూసుకో! పిచ్చిగా వాగకు!" అర్చాడు ధర్మారావు.

"ఎవరుండవలసిన స్థలంలో వాళ్ళుంటే ఏ సమస్యలూ వుండవు!" అందామె.

"ఎవర్నీ నొప్పించకుండా జీవించడం నేర్చుకోవాలి నువ్వు! వాళ్ళు యీ మధ్యనే వచ్చారు. ఇంతకుముందు నా వాచ్ పోయింది! గుర్తుందా?"

"పోలీసు రిపోర్టు యివ్వండి!" అందామె.

"అదంతా అనవసరం. ఆ గాజులను గురించి యింక మాట్లాడకు!" అన్నాడు ధర్మారావు.

ధర్మారావు మెల్లిగా రామ్ ముందుకు నడిచాడు.

"రామ్, ఎన్నేళ్ళుగానో యీ యింట్లో దొంగతనాలు జరుగుతున్నాయి. నువ్వు చాలా తెలివైనవాడివి. యేం జరుగుతుందో కనుక్కో" అన్నాడు ధర్మారావు.

"కనుక్కుంటాను" అన్నాడు రామ్.

9

ఏదో పీడ కలొచ్చి గాఢనిద్రలోంచి రామ్ మేల్కొన్నాడు. పక్క పడుకున్న జయ మీదకు చెయ్యిని పోనిచ్చాడు.

కళ్ళు తెర్చి చూశాడు. పక్కమీద జయ లేదు. ఆమె యేమైంది? ఇంత రాత్రివేళ యెక్కడికెళ్ళింది?

రామ్ కిందకు దూకాడు. పక్క గదిలోకి నడిచాడు. నిలబడి వెనకగది గుమ్మంవంక చూశాడు. తలుపు దగ్గర వున్న జయకేసి అతడు ఆశ్చర్యంగా చూశాడు.

తాళం తీసి ఆమె లోపలకు వెళ్ళింది. ఏవో వస్తువులను గదిలో పడేసి తాళం వేసిందామె.

రామ్ వెనక్కు వెళ్ళాడు. ఏమీ తెలియనట్లు తన పరుపుమీద పడుకున్నాడు. కాస్సేపట్లో జయ వచ్చింది. తాళంచెవిని పరుపు కింద పెట్టి పక్కనే ఆమె పడు

కొంది.

రామ్ నిద్రబోయినట్లు నటిస్తున్నాడు. గంట తర్వాత అతను లేచాడు. పక్క నున్న భార్యవైపు చూశాడు. కనురెప్పలు కదలడంలేదు. ఆమె గాఢనిద్రలో వుంది.

రామ్ కిందకు దిగాడు. పరుపుకింద దాచిన తాళం చెవిని తీశాడు. మెల్లిగా వెనుక నున్న గదివైపు నడిచాడు.

తలుపుకు పెద్ద తాళంకప్ప వేసివుంది. అతడు తాళాన్ని తెర్చాడు. లోపల చీకటిగా వుంది. గదిలోకి వెళ్ళి స్విచ్ ఆన్ చేశాడు. లైటు వెలిగింది.

మొజయిక్ ఫ్లోర్ మీద వున్న వస్తువులవైపు ఆశ్చర్యంగా చూశాడు,

బట్టలు! వాచ్‌లు! పెన్నులు! బంగారం నగలు, రకరకాల చెప్పులు, ఊటీలో మాయమైన తన గోల్డు సిగరెట్ కేసు నేలమీద పడుంది. సంవత్సరం క్రితం పోయిన తన పాంటు, షర్టు అక్కడ పడున్నాయి.

ఆశ్చర్యంతో అతడు గదిలోని వస్తువులవైపు చూస్తూ వుండిపోయాడు. రామాయమ్మ పోయాయన్న బంగారు గాజులు నేలమీద పడున్నాయి!

ఎన్ని వస్తువులనో దొంగిలించి జయ రహస్యంగా ఆ గదిలో పడేసి తాళం వేస్తోంది. ఆమె ఎందుకిలా చేస్తోంది?

రామ్ బయటకొచ్చి తలుపు మూసి తాళం వేశాడు. తాళంచెవిని పరుపుకింద వుంచి తన భార్య పక్కనే పడుకున్నాడు. చాలాసేపటివరకూ అతడికి నిద్ర పట్టలేదు. ఆమెను గురించే ఆలోచిస్తున్నాడు!

ప్రొద్దున లేచి రామ్ లేచాడు. జయ ఎనిమిదిదాకా

లేవదు. వరండాలో కూర్చుని గడ్డం గీసుకుంటున్న ధర్మారావు ముందుకు నడిచాడు.

రామ్ వైపు ధర్మారావు నవ్వుతూ చూశాడు.

"నిన్న మీరు నాకొక పని కల్పించారు. రాత్రి విచిత్రమైన పరిస్థితుల్లో దొంగ యెవరో గుర్తించగల్గాను" అన్నాడు రామ్.

"ఎవరు?" అడిగాడు ధర్మారావు.

"మీరు నాతో రండి. ఆ గదిలోకి వెళ్ళి చూద్దాం" అన్నాడు రామ్.

షేవింగ్ మానేసి ధర్మారావు లేచి నుంచున్నాడు.

"పద!"

తాళం తెర్చి అదే గదిలోకి యిద్దరూ వెళ్ళారు. అక్కడ పడున్న వస్తువులవైపు ధర్మారావు ఆశ్చర్యంగా చూశాడు. తన అమెరికన్ వాచ్‌ని తీసుకుని చేతికి కట్టుకున్నాడు.

"ఈ గదిలో వీటిని ఎవరు పడేశారు?"

"మీ అమ్మాయి జయ!"

ధర్మారావు ఉలిక్కిపడ్డాడు.

"దొంగిలించవలసిన ఖర్మ దానికెందుకు పట్టుంది? ఏది కావాలన్నా ఆమె క్షణంలో కొనగలదు!"

"కొనడంలో ఆమెకు థ్రిల్ లేదు. ఇలా దొంగిలించి దాచడంలో యేదో థ్రిల్‌ను ఆమె పొందుతూవుండాలి. ఆమె దొంగ కాదు. క్లెప్టోమేనియాక్! అదొక మానసిక రోగం. దొంగిలించవలసిన అవసరం ఆమెకు లేదు. వాటిని ఆమె వాడడం లేదు. దొంగిలించిన వస్తువులను యీ గదిలో పడేస్తోంది" అన్నాడు రామ్.

ధర్మారావు రామ్ భుజంమీద చెయ్యివేశాడు.

"రామ్ దీన్ని గురించి యెవ్వరికీ చెప్పకు. నా భార్యకు కూడా తెలియకూడదు. ఇటువైన అమ్మాయి ఇలా చేయకుండా మనం జాగ్రత్తపడాలి. ఏం చేద్దాం."

"ఇదే పట్నంలో నా ఫ్రెండ్ వున్నాడు. అతడు అమెరికాలో చదువుకుని వచ్చాడు. చాలా పేరున్న సైకియాట్రిస్టు. అతడిని కలుసుకుంటే ఏం చేయవలసిందీ చెప్తాడు" అన్నాడు రామ్.

"వెంటనే కల్సుకోడం మంచిది" అన్నాడు ధర్మారావు.

ఇద్దరూ బయటకొచ్చారు. రామ్ తాళం వేశాడు. తాళంచెవిని పరుపుకింద పెట్టాడు.

ధర్మారావు షేవ్ చేసుకోసాగాడు.

"ఆ గదిని నువ్వెలా కనుక్కున్నావు?"

క్రితం రాత్రి జరిగినదంతా రామ్ వివరంగా చెప్పాడు.

"రామ్, దీన్ని గురించి యే ప్రచారం లేకుండా మనం జాగ్రత్తపడాలి" అన్నాడు ధర్మారావు.

రామ్ నవ్వుతూ అతడివైపు చూశాడు.

"ఆమె నా భార్య. మీ కూతురు. బయట వాళ్ళకు యేమీ తెలియకుండా నేను వ్యవహరిస్తాను" అన్నాడు రామ్.

—:అ యి పో యి ం ది:—